కబ్జాలో జువ్వలపాళెం చెరువు


చెరువు ఆక్రమించి ఆక్రమణదారులు సాగు చేస్తున్న వరి పంట


చెరువులో కొనసాగుతున్న ఆక్రమణలు


ఆక్రమణలతో కుచించుకుపోయిన చెరువు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని జువ్వలపాళెం చెరువు కబ్జా కోరల్లో చిక్కుకు పోయింది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే చెరువును బడా బాబులు చెరపట్టారు. ఇష్టానుసారంగా ఆక్రమించుకుని పొలాలుగా మార్చేస్తున్నారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. భారీగా వర్షాలు కురిసి చెరువులో నీరు చేరితే అక్రమార్కులు వారి పంట పొలాలు మునిగి పోకుండా కట్టలు సైతం తెగ్గొడుతూ చెరువులో నీరు నిల్వ లేకుండా చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో చెరువుల్లో మట్టి అక్రమ తరలింపు చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో యంత్రాలతో చెరువును చదును చేసేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. .

13న ఔలియా గంధ మహోత్సవం

గూడూరురూరల్ : పట్టణంలో ఆగస్టు 13న నిర్వహించే సయ్యద్ మస్తాన్ ఔలియా గంధ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను శనివారం దర్గా ఆవరణలో దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఏటా మొహరం తరువాత వచ్చే సఫర్ నెల చంద్రోదయం చూసిన వెంటనే హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో 26న సాయంత్రం నిషాన్ జెండా కార్యక్రమం ఉంటుందన్నారు. ఆగస్టు 13న గంధ మహోత్సవం, అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత గురువులు మగ్దూమ్ అలీషా, గౌస్ మస్తాన్ ఖాదరి, కమిటీ సభ్యులు షానవాజ్, సంధాని బాషా, గోల్డెన్ గౌస్, షబ్బీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైదాపురంలో కాంప్లెక్స్ సమావేశం

సైదాపురం: మండల కేంద్రంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో మూడో శనివారం సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈఓ సుప్రియ నిర్వహించారు. నూతన విద్యావిధానంపై అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికి వినతి


కార్యదర్శికి విన్నవిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దక్కిలి: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నేత మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి అధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యదర్శి చైతన్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామ వీధుల్లో వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. డక్కిలి చెరువు కట్ట మీద ఉన్న పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో కట్టకు దగ్గరగా ఉన్న ఇళ్లకు విష సర్పాల బెడద అధికంగా ఉందని చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

సైదాపురం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని మండల వైద్యాధికారులు డాక్టర్ జనార్దన్, డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

నేడు మల్లాంలో ఆడికృత్తిక మహోత్సవం

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో వల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ శశాంక్ కుమార్ శనివారం తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కావడి ఉత్సవం, స్వామి అమ్మవార్లకు శాంతి కల్యాణం, గ్రామోత్సవం, భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి ప్రతి ఏటా భక్తులు వస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోట: విద్యార్థి దశలో చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దుగ్గరాజపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. కోటలోని బీసీ బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులకు మెరైన్ పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలుగు అనర్థాలను వివరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శివసౌమ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎం తీరుపై డిప్యూటీ డీఈఓ పరిశీలన

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ప్లస్ (జూనియర్ కళాశాల)ను శనివారం డిప్యూటీ డీఈఓ సనత్ కుమార్ పరిశీలించారు. సాక్షిలో హై స్కూల్ ప్లస్ హెచ్‌ఎం తీరు వివాదాస్పదం అనే శీర్షికతో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. డీఈఓ ఆదేశాల మేరకు విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కళాశాల విద్యార్థినులతో హెచ్‌ఎం దురుసుగా ప్రవర్తించిన విషయం వాస్తవమేనన్నారు. అయితే కళాశాల ఉపాధ్యాయినులకు, హెచ్‌ఎంకు మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమూ ఓ సమస్యేనని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారుల నివేదించనున్నట్లు డిప్యూటీ డీఈఓ వివరించారు.

పేలుడు ఉండ తిని గేదె దవడ ఛిద్రం

పెళ్లకూరు: పేలుడు ఉండ నమలిన గేదె దవడ ఛిద్రమైన సంఘటన మండలంలో శనివారం చోటచేసుకుంది. మండలంలోని కానూరు దళితకాలనీకి చెందిన నిడిగింటి రమణయ్యకు చెందిన గేదెను గ్రామంలోని పశువులతో శనివారం మేత కోసం అడవికి పంపారు. గేదె గడ్డి మేస్తుండగా గడ్డిలో వేటగాళ్లు అడవి జంతువుల కోసం ఏర్పాటుచేసిన పేలుడు ఉండను నమలడంతో నోట్లోనే పేలిపోయింది. దీంతో గేదె తల దవడభాగం ఛిద్రమై పోయిందని, మేత తినే పరిస్థితి లేదని రైతు వాపోయాడు.

చికెన్ ధరలు		20.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	126
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	250
లేయర్ చికెన్	:	190

పైప్‌లైన్ పగిలి తాగునీరు కలుషితం


దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పాత బస్టాండు వద్ద ప్రధాన రహదారి వద్ద శనివారం తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయి మురుగు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. బస్టాండు నుంచి పట్టణానికి వచ్చే ప్రధాన రహదారి వద్ద సిమెంట్ రోడ్డును జేసీబీతో అక్కడి దుకాణదారుడు ధ్వంసం చేశారు. అతని దుకాణం నుంచి మురుగునీరు డ్రైనేజీ కాలువలో వెళ్లేందుకు పైప్‌లైన్ వేసేందుకు పనులు చేశారు. అయితే జేసీబీతో పనులు చేస్తుండగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయాయి. అందులో మురుగునీరు కలుషితమవుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి కమిషనర్ ఊరుకుందమ్మను ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.

ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం


ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను దుకాణదారులకు వివరిస్తున్న రేంజర్ రవీంద్రబాబు

రాపూరు: ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫారెస్ట్ రేంజర్ రవీంద్రబాబు పిలుపునిచ్చారు. సమీపంలోని మద్దెలమడుగులో శనివారం స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకంలో అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు చేపడుతుందన్నారు. వస్త్ర సంచులు వినియోగించుకోవాలని దుకాణదారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పిచ్చిరెడ్డి, ఖాజారసూల్, సెక్షన్ అధికారులు చక్రపాడి, చంద్రశేఖర్, చరణ్, బీట్ అధికారులు, బేస్‌క్యాప్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

గూడూరురూరల్ : క్షయ వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో శనివారం పయ్యావుల మురళీనాయుడు సహకారంతో పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ నారాయణ, క్షయ వ్యాధి సూపరింటెండెంట్ సురేంద్రరెడ్డి, ప్రియాంక, ల్యాబ్ టెక్నీషియన్ జస్విత సింగ్, సంస్థ ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కోట శ్రీనివాసులు, కుమార్ నాయుడు, విశ్రాంత ఎస్ఐ. ప్రభాకర్, డీవీఎంసీ సభ్యులు కోట వెంకటేశ్వర్లు, నాగరాజు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టానికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీలో కార్యకర్తల అభీష్టం మేరకు అడుగులు ముందుకు వేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణం సనత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం బాబు షూ్యరిటీ, మోసం గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన తరువాత ప్రజలకు ఒరిగింది ఏమి లేదని అన్నారు. నియోజకవర్గంలో స్థానిక ప్రజా ప్రతినిధి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసి వాటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కూడా అత్యుత్సాహం చూపిస్తూ ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గూడూరు పట్టణ, మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి , మెట్టా రాధాక్రిష్ణారెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, వాయిగండ్ల నాగరాజు, మగ్దూం మొహీద్దీన్, కలికి జనార్ధనరెడ్డి, నాశిన నాగులు, దీప్తి మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న అధికారులు


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి గ్రామంలోని వాగు పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న గోదాము కట్టడాన్ని శనివారం వీఆర్వో జయరామయ్య, ఆర్ఐ సునీల్ నిలుపుదల చేశారు. గోడౌన్‌ను నిర్మిస్తున్న ఎన్ఆర్ఐ కుటుంబ నెల్లూరులో ఉండి ఇక్కడ పనివాళ్ల చేత నిర్మాణాన్ని చేపట్టారని రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన వాగు, పొరంబోకు భూములలో అక్రమ నిర్మాణ కట్టడాలను ఉపేక్షించేది లేదని వారు తెలియజేశారు. తిరిగి నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

గూడూరురూరల్ : ఏఐటీయూసీ అనుబంధ విభాగం గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అసోసియేషన్ డివిజన్ నాయకులు మధిర బాలయ్య కోరారు. శనివారం గూడూరు రూరల్ పరిధిలోని గోగినేనిపురం వద్ద ఉన్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జశ్వంత్, శీను, శివ, నరేష్, సంధాని పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


విరాళం ఇస్తున్న సాయితేజ


విరాళం అందిస్తున్న పద్మనాభయ్య కుటుంబసభ్యులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్న దాన పథకానికి వైఎస్సార్ కడప టౌన్‌కు చెందిన పెరబొట్ల పద్మనాభయ్య కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన మలినేని శ్రీరాములు, లక్ష్మి దంపతుల కుమారుడు సాయితేజ తన మొదటి జీతాన్ని రూ.31,250ను విరాళంగా అందించినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర్ గౌడ్

చిట్టమూరు: మండలంలోని 23 పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ మనోహర్ గౌడ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో తాగునీటి పైపులు లీకులు ఉంటే వెంటనే మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు మాత్రమే తరలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మహేష్, ఈఓపీఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధి వల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి, రుద్ర హోమ పూజలు, పూర్ణాహుతి, మహానివేదన పూజలను వైభవంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీ దేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి అక్కడ కొలువుదీరి, శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం


విజేతలకు బహుమతులిస్తున్న అనిల్‌కుమార్

రాపూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణ సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు మార్గంలో ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి శనివారం బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణించేందుకు సంస్థ లక్కీడిప్ ఏర్పాటు చేసి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. రాపూరు–గూడూరు, రాపూరు–వెంకటగిరి మార్గ మధ్యలో ప్రయాణికులు బస్సు దిగేసమయంలో తమ టికెట్‌పై ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేస్తే ప్రతి 15 రోజులకోసారి లక్కీడిప్ ద్వారా నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మినర్వాలో ఎన్నికలు


గెలిచిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

గూడూరురూరల్: పట్టణంలోని మినర్వా ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శనివారం విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎస్‌పీఎల్‌గా అంకుర్, శృతి, ప్రదీప్త, అసిస్టెంట్ ఎస్‌పీఎల్‌గా కౌషిక్, సాయి, అనుత్తమ ఎంపికయ్యారు. స్పోర్ట్స్ విభాగంలో కెప్టెన్లుగా సుబ్బారావు, రుచిత, కీర్తి, వైస్ కెప్టెన్లుగా కీర్తి వర్ధన్, గ్రీష్మిత ఎంపికయ్యారు. దీనికి ఎలక్టోరల్ ఆఫీసర్లుగా ఉపాధ్యాయులు శ్రీనివాసులు, గిరీష్‌కుమార్ వ్యవహరించారు. స్కూల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రాంప్రసాద్ విజేతలను అభినందించారు.

ప్రణాళికలపై శిక్షణ

దొరవారిసత్రం : మండలంలోని వెలుగు కార్యాలయంలో శనివారం వెలుగు అధికారులు సీసీలు, వీఓఏలు, వీఓ అధ్యక్షులకు శిక్షణ తరగతులు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు.

ప్రజలను వంచించడమే బాబు నైజం


క్యూఆర్‌కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు

ఓజిలి: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాగానే మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఓజిలి గ్రామంలో శనివారం చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బాబు షూ్యరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కిలివేటి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలుచేయలేని 145 హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని తెలిపారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామాల్లో తెలియజేయాలన్న సంకల్పంతో ఈ క్యూఆర్ కోడ్ అందించారని తెలిపారు. గ్రామాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే బాబు మోసాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. అనంతరం నాయకులతో కలసి క్యూఆర్‌కోడ్ స్కాన్ పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, ఎంపీపీ అరుణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శి వెంకటసుబ్బరాజు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌భాషా, నియోజకవర్గ మహిళ అధ్యక్షులు ప్రవీణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు రాజారామిరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, ఉపాధ్యక్షుడు సుబ్బనాయుడు, ఎంపీటీసీ రఘురామరాజు, సర్పంచ్‌లు సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రాజు, మహేందర్‌రెడ్డి, హంసవేణి, పంజాం వసంతమ్మ, గోపాలయ్య. మాజీ సర్పంచ్ ఆరణి దిలీప్‌కుమార్ రెడ్డి, నాయకులు దామోదర్‌రాజు, రామచంద్రరాజు, గూడూరు సురేంద్రరెడ్డి, పిండుకూరు మధుసూదన్‌రెడ్డి, దాసరి సాయి, పోలయ్య, గోపాలయ్య, పరంగి ప్రసాద్, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ ఆరణి దిలీప్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా నిర్వహించారు.

జీవ సాంకేతిక విజ్ఞాన గ్రంథం ఆవిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విక్టోరియా రాణి రచించిన జీవ సాంకేతిక విజ్ఞాన గ్రంథాన్ని శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గ్రంథం రూపకర్త విక్టోరియా రాణి మాట్లాడుతూ ఈ గ్రంథం వల్ల జీవులను వాటి భాగాలను లేదా ఉత్పత్తులను ఉపయోగించి మానవ ప్రయోజనాల కోసం సాంకేతికతను అభివృద్ధి చేసే శాస్త్రమన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో పంటలు దిగుబడిని పెంచడానికి, తెగుళ్లను తట్టుకునే పంటలను పెంచడానికి ఈ గ్రంథం ఉపయోగపడుతుందని తెలిపారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి రాజా, పి.ఏడుకొండలు, శరత్‌బాబుతోపాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు విక్టోరియారాణిని సత్కరించి మరీ అభినందించారు.

పరిసరాల శుభ్రత మన బాధ్యత


కోర్టు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ విష్ణువర్మ పేర్కొన్నారు. స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కోర్టు ప్రాంగణంలో సిబ్బంది శుభ్రత చర్యలు చేపట్టారు. న్యాయమూర్తి విష్ణువర్మ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. బాలాయపల్లిలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలంటూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కలువాయిలో ప్లాస్టిక్ నిర్మూలించే దిశగా విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ జీవీ రమేష్ బాబు, ఎంఈఓ శేషగిరిబాబు, సీనియర్ సహాయకులు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించాలి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో పట్టణ ప్రజలు, వ్యాపారులను సమావేశపరచి ప్లాస్టిక్ నివారణపై మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ అవగాహన కల్పించారు. అంబేడ్కర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

పాఠశాలలో..

దొరవారిసత్రం : మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేశారు. పారిశుధ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు గ్రామ సచివాలయం సిబ్బంది అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

కోట: ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉత్తమనెల్లూరు, చీకళ్లదిబ్బ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, టీకప్స్ వంటివి వాడకుండా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.